www.aksharavelugu.com

# అక్షర వెలుగు

జనం కోసం - మన అక్షరం

తెలుగు దిన పత్రిక

మంగళ వారం
07 | జూన్ | 2022
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్
సంపుటి - 01, సంచిక-95
పేజీలు - 4 వెల రూ. 5

ఎడిటర్ :
గోసుకొండ పృధ్విరాజు

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

## అంతర్జాతీయ వాణిజ్యంలో మన కరెన్సీ భాగస్వామ్యం

అంధులు గుర్తించేలా రూపొందించిన నాణాలు విడుదల ❑ప్రధాని మోడీ వెల్లడి




**న్యూఢిల్లీ, జూన్ 6 (అక్షర వెలుగు):** అంతర్జాతీయ వాణిజ్యంలో భారత దేశ బ్యాంకులతో పాటు కరెన్సీని ముఖ్యమైన భాగంగా మార్చాల్సిన అవసరం ఉందని ప్రధాని నరేంద్ర మోదీ నొక్కిచెప్పారు. కేంద్ర ఆర్థిక శాఖ చేపట్టిన ఐకానిక్ వారోత్సవాలను ప్రారంభించిన ఆయన.. అంధులు సులభంగా గుర్తించే వీలున్న వివిధ కరెన్సీ నాణెళిలను ఆవిష్కరించారు. అంధులు సులభంగా గుర్తించే వీలున్న కొత్త సిరీస్ నాణెళిలను సోమవారం ప్రధాని మోదీ ఆవిష్కరించారు. రూ.1, రూ.2, రూ.5, రూ.10, రూ.20 విలువగల నాణెళిలు.. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ డిజైన్‌ను కలిగి ఉంటాయని తెలిపారు. అయితే ఇవి కేవలం స్మారక నాణెళిలు కావని.. చలామణీలో ఉంటాయని ఆయన చెప్పారు. ఈ కొత్త సిరీస్ నాణెళిలు.. ఆజాదీకా అమృత్ మహోత్సవ లక్ష్యాన్ని ప్రజలకు గుర్తు చేస్తాయని, దేశ అభివృద్ధికి కృషి చేయడానికి ప్రజలను ప్రేరేపిస్తాయని అన్నారు.అంతర్జాతీయ వ్యాపారం, సరఫరా గొలుసులో భారత దేశ బ్యాంకులతో పాటు కరెన్సీకి కీలక భాగస్వామ్యాన్ని కల్పించాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ శాఖ చేపట్టిన ఐకానిక్ వారోత్సవాలను ప్రధాని సోమవారం ప్రారంభించారు. 12 ప్రభుత్వ పథకాల్లో భాగంగా యువత, వ్యాపారులు, రైతులకు సులభంగా రుణాలు అందించేందుకు ఏర్పాటు చేసిన 'జన సమర్థ్ పోర్టల్'ను ఈ సందర్భంగా ఆయన ఆవిష్కరించారు. కేంద్రం సమకూర్చిన పక్కా ఇళ్లు, విద్యుత్, గ్యాస్, తాగునీరు, ఉచిత వైద్యం.. పేదల గౌరవాన్ని పెంచాయని తెలిపారు. 'స్వాతంత్ర్య దినోత్సవ 75ఏళ్ల ఉత్సవాన్ని నిర్వహించుకుంటున్న ప్రస్తుత తరుణంలో దేశ అభివృద్ధి కోసం తమ తమ స్థాయిల్లో కృషి చేయడం ప్రతి ఒక్క భారతీయుడి కర్తవ్యం. ఆర్థిక సమ్మిళిత కోసం మేము ఒక వేదికను తయారు చేశాం. దాని ఉపయోగాల గురించి అవగాహన పెంచాలి. మన బ్యాంకులు, కరెన్సీ.. అంతర్జాతీయ సరఫరా గొలుసు, వ్యాపారంలో కీలక భాగస్వామి కావడంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ అన్నారు.

# కరెన్సీ నోట్ల ముద్రణలో మార్పు లేదు

## గాంధీ బొమ్మలతోనే నోట్ల ముద్రణ ■ ఆర్‌బిఐ స్పష్టీకరణ

**ముంబై, జూన్ 6 (అక్షర వెలుగు):** దేశంలోని కరెన్సీ నోట్లపై ఠాగూర్, అబ్దుల్ కలాం చిత్రాలను ముద్రించే అంశంపై స్పష్టత ఇచ్చింది భారతీయ రిజర్వ్ బ్యాంకు. అలాంటి ప్రతిపాదనేదీ తమ వద్ద లేదని కుండబద్దలు కొట్టింది. కరెన్సీ నోట్ల మార్పు వార్తలు అవాస్తవమని స్పష్టం చేసింది. కరెన్సీ నోట్లపై రవీంద్రనాథ్ ఠాగూర్, అబ్దుల్ కలాం చిత్రాలను ముద్రించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు వచ్చిన వార్తలను భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఖండించింది. ప్రస్తుతం ఉన్న కరెన్సీ, బ్యాంకు నోట్లపై చిత్రాలు, కొత్త వాటర్ మార్క్‌లతో మార్పులు చేసే ప్రతిపాదనేదీ తమ వద్ద లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు కరెన్సీ నోట్ల మార్పు వార్తలకు ముగింపు పలికింది. చిత్రాలను ముద్రించే అంశాన్ని భారతీయ రిజర్వు బ్యాంకు పరిశీలిస్తున్నట్లు పలు జాతీయ మీడియాలో వార్తలు వెలువడ్డాయి. ప్రస్తుతం కరెన్సీ నోట్లపై గాంధీ చిత్రం మాత్రమే ఉండగా.. తొలిసారి ఇతరుల చిత్రాలను కూడా కరెన్సీ నోట్లపై ముద్రించాలని ఆర్‌బీఐ ఆలోచిస్తున్నట్లు పేర్కొన్నాయి. 2017లోనే ఈ ప్రతిపాదన వచ్చినా ఇప్పటివరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని, అయితే ఈ విషయమై త్వరలోనే ఒక నిర్ణయానికి రావాలని ఆర్‌బీఐ భావిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. తాజాగా ఆ వార్తలను ఖండించింది.




## తెలంగాణపై బిజెపి ప్రత్యేక ఫోకస్

కెసిఆర్ అవినీతి పైనా దృష్టి పెట్టామంటూ ప్రచారం

అధికారం లక్ష్యంగా పావులుకదుపుతున్న నేతలు

**హైదరాబాద్, జూన్ 6 (అక్షర వెలుగు):** బిజెపి తెలంగాణ రాజకీయాలపై గట్టిగానే ఫోకస్ పెట్టింది. ఇక్కడే జాతీయకార్యవర్గ సమావేశాలు వచ్చే నెల్లో నిర్వహించేందుకు స్నాహాలు చేస్తోంది. తెలంగాణకు పెద్దపీట వేయాలన్న సంకల్పంతో ఓబిసి నేత లక్ష్మణ్‌ను రాజ్యసభకు పంపారు. కేసీఆర్ చర్యలను భారతీయ జనతా పార్టీ అగ్రనాయకులు నిశితంగా గమనిస్తున్నారు. ఎడాపెడా అప్పులు చేసి కమిషన్ల రూపంలో దండుకుంటూ తమపైనే యుద్ధం ప్రకటించడం ఏమిటని బీజేపీ నాయకత్వం ఆగ్రహంగా ఉంది. కేసీఆర్‌ను తమ శత్రువుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం అంతర్గత సమావేశాల్లో ప్రకటిస్తున్నారు. ప్రభుత్వ ఏజెన్సీలు కూడా కేసీఆర్‌పై నిఘా పెట్టాయని బిజెపి పరోక్షంగా హెచ్చరికలు చేతోంది. కేసీఆర్ చుట్టూ కేంద్ర పెద్దలు ఉచ్చు బిగిస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వంటి సంస్థలు ఏ క్షణంలోనైనా రంగంలోకి దిగవచ్చునని చెబుతున్నారు. నీటిపారుదల శాఖకు చెందిన అనుచిత చెల్లింపులకు సంబంధించి నిర్దుష్టమైన ఆధారాలు కేంద్ర ప్రభుత్వ వద్ద ఉన్నాయిన బిజెపి నేతలు బాహాటంగగానే చెబుతున్నారు. జైలుకు పంపుతామని పదేపదే చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్ విషయం ఎలా ఉన్నప్పటికీ తెలంగాణలో అధికారంలోకి రావాలని బీజేపీ పట్టుదలగా ఉంది. పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశాన్ని కూడా ఈ కారణంగానే హైదరాబాద్‌లో నిర్వహించబోతున్నారు. తెలంగాణలో దాని ప్రభావం బీజేపీ విజయావకాశాలపై ఉంటుంది. తెలంగాణలో దాదాపు 25 నియోజకవర్గాల్లో సీమాంధ్రుల సంఖ్య గణనీయంగా ఉంది. గతంలో లాగా సెటిలర్లు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ పట్ల కూడా అంత సానుకూలంగా లేరు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖాన్ని చూడ్డానికి కూడా తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇష్టపడడం

2

## గూగుల్‌కు ఆస్ట్రేలియా కోర్టు షాక్

4 కోట్లు చెల్లించాలంటూ ఆదేశాలు




**సిడ్నీ, జూన్ 6 (అక్షర వెలుగు):** ప్రముఖ సర్చ్ ఇంజిన్ గూగుల్‌కు ఆస్ట్రేలియా కోర్టు భారీ జరిమానా విధించింది. ఓ రాజకీయ నాయుకుడికి సుమారు రూ.4 కోట్లు చెల్లించాలని ఆదేశించింది. వివాదాస్పద వీడియోల కారణంగా ఆ నేత రాజకీయాలను వీడాల్సి వచ్చిందని పేర్కొంది. ఓ రాజకీయ నాయకుడికి వ్యతిరేకంగా యూట్యూబ్‌లో వైరల్ అయిన వివాదాస్పద వీడియోల కారణంగా ఆయన రాజకీయాలను వీడాల్సి వచ్చిందని, అందువల్ల ఆ నేతకు 5,15,000 డాలర్లు(దాదాపు రూ.4కోట్లు) చెల్లించాలని ఆదేశించింది. ఆస్ట్రేలియాలోని న్యూ పౌత్ వేల్స్ డిప్యూటీ ప్రీమియర్‌గా ఉన్న జాన్ బరిలారోను విమర్శిస్తూ.. జోర్డాన్ శాంక్స్ అనే రాజకీయ విశ్లేషకుడు 2020 చివర్లో యూట్యూబ్‌లో కొన్ని వీడియోలు పోస్ట్ చేశారు. ఎలాంటి ఆధారాలు చూపించనప్పటికీ.. జాన్‌పై శాంక్స్ తీవ్రమైన అవినీతి ఆరోపణలు చేశారు.

2

## అప్పులకుప్పగా కెసిఆర్ పాలన

జీతాలకు డబ్బులేకుండా చేశారు

కెసిఆర్ గద్దె దిగితే తప్ప మోక్షం లేదు: కోదండరామ్



**హైదరాబాద్, జూన్ 6 (అక్షర వెలుగు):** కేసీఆర్ పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని టీజేఎస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ కోదండరాం విమర్శించారు. సోమవారం హైదరాబాద్ లోని ఇందిరా పార్కు వద్ద చేపట్టిన ఆత్మగౌరవ దీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. నిధుల ఖర్చు విషయంలో ఒక పద్ధతి లేకపోవడం అప్పులకు కారణమన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే డిమాండ్ తో రాష్ట్రం ఏర్పడిందని, అయితే అవేమీ కేసీఆర్ పాలనలో నెరవేరలేదన్నారు. కాళేశ్వరంప్రాజెక్ట్‌తో ఎలాంటి ఉపయోగంలేదన్నారు. ఉద్యోగులకు జీతాలిచ్చేందుకు ప్రభుత్వం వద్ద నిధులు లేవని మండిపడ్డారు. ఇక ఉద్యోగ నోటిఫికేషన్లు లేక నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ ను ఓడిస్తే తప్ప ప్రజలకు మేలు జరగదన్నారు.

## పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి

కార్పోరేట్ స్కూళ్లకు ధీటుగా అభివృద్ధి ● పల్లె నిద్రలో మంత్రి నిరంజన్ రెడ్డి




**వనపర్తి, జూన్ 6 (అక్షర వెలుగు):** మన ఊరు– మన బడి కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా సర్కారు బడులను తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. దశలవారీగా అన్ని పాఠశాలల్లో డిజిటల్ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టి, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరచడం, మౌలిక వసతులను ఏర్పాటుచేసేందుకే ఈ పథకాన్ని రూపొందించామన్నారు. పల్లెనిద్రలో భాగంగా వనపర్తి మండలం పెద్దగూడెం తండాలో మంత్రి మార్నింగ్ వాక్ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో సమస్యలు పరిశీలించారు. బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 26,065 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో చదువుతున్న 19,84,167 మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలన్నదే సీఎం కేసీఆర్ సంకల్పమని చెప్పారు. దీనికోసం ప్రభుత్వం రూ.7,289 కోట్లు ఖర్చుచేయనున్నదని తెలిపారు. మొదటి దశలో రూ.3,497.62 కోట్లు కేటాయించామన్నారు.

## తెలంగాణ సంస్కృతిని చాటే విధంగా బోనాలు

ఉత్సవాలకు ప్రభుత్వం రూ.15 కోట్లు కేటాయింపు

అధికారులతో సమీక్షలో మంత్రి తలసాని



**హైదరాబాద్, జూన్ 6 (అక్షర వెలుగు):** తెలంగాణ సంస్కృతిని చాటి చెప్పే విధంగా బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ప్రభుత్వం రూ.15 కోట్లు కేటాయించిందని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు.సోమవారం ఎంసిహెచ్‌ఆర్డిలో జాతర ఏర్పాట్లను అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ బోనాలను అత్యంత వైభవంగా నిర్వహించాలనే ఆలోచనతో ప్రభుత్వం 15 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని తెలిపారు. బోనాల కోసం ప్రభుత్వ దేవాలయాలకే కాకుండా ప్రయివేట్ దేవాలయాలకు సుమారు 3 వేల దేవాలయాలకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వివరించారు.ఎలాంటి ఆటంకాలు లేకుండా బోనాల ఉత్సవాలను నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని అన్నారు. జిహెచ్‌ఎంసి ఆధ్వర్యంలో రహదారుల మరమ్మతులు,

2

## బండి సంజయ్ వ్యాఖ్యలు దారుణం

శ్రీలంక మారింది గుజరాత్, యూపిలే

ఘాటుగా విమర్శలు గుప్పించిన మంత్రి జగదీశ్వర్ రెడ్డి



**సూర్యాపేట, జూన్ 6 (అక్షర వెలుగు):** తెలంగాణను శ్రీలంకతో పోల్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పై మంత్రి జగదీష్ రెడ్డి మండిపడ్డారు. శ్రీలంకలాగా మారింది గుజరాత్, యూపీ రాష్ట్రాలేనని అన్నారు.. తెలంగాణ అభివృద్ధిలో దూసుకెళ్తుందని స్పష్టం చేశారు. ఆకలి ఇండెక్స్‌లో పాకిస్తాన్, బంగ్లాదేశ్ తరవాతి స్థానంలో భారత్ ఉందంటే అందుకు బీజేపీ వైఫల్య పాలనే కారణమని విమర్శించారు.

2

## రాష్ట్రంలో కాంగ్రెస్, బిజెపిలకు అంత సీన్ లేదు

అరచేతిలో వైకుంఠం చూపిస్తాం జాగ్రత్త

నారాయణ్‌పేట జిల్లాలో పర్యటించిన మంత్రి హరీశ్‌రావు



**నారాయణ్‌పేట, జూన్ 6 (అక్షర వెలుగు):** బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఒక వేళ అధికారంలోకి

2

## రాష్ట్రాలు బలపడితేనే దేశాభివృద్ధి




అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను దెబ్బతీయొద్దు

ఎన్నికలప్పుడే రాజకీయాలు ఉండాలి

తరవాత అంతా అభివృద్ధి గురించే తపన

పరిశ్రమల శాఖ వార్షిక నివేదిక విడుల చేసిన మంత్రి కేటీఆర్

**హైదరాబాద్, జూన్ 6 (అక్షర వెలుగు):** ప్రగతిశీల రాష్ట్రాలను ప్రోత్సహించాలే తప్ప అణగదొక్కకూడదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. రాజకీయాలకు

2

## బైకర్‌ను ఢీకొట్టిన కారు యజమాని

**న్యూఢిల్లీ, జూన్ 6 (అక్షర వెలుగు):** ఢిల్లీలో ఓ కారు యజమాని రెచ్చిపోయాడు. ఉద్దేశపూర్వకంగా బైకర్‌ను ఢీకొట్టి పారిపోయాడు. ఢిల్లీ అర్జున్‌ఘడ్ మెట్రో స్టేషన్ సమీపంలో జరిగిన ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఘటనను సుమోటోగా స్వీకరించిన పోలీసులు కారు యజమానిపై కేసు బుక్ చేశారు. బాధిత బైకర్ 10 మంది స్నేహితులతో కలిసి గురుగ్రామ్ నుంచి ఢిల్లీ తిరిగి వస్తుండగా ఓ కారు యజమాని వారికి చేరువగా వచ్చాడు. ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ బైకర్లను భయభ్రాంతులకు గురిచేశాడు. అంతటితో ఆగకుండా వారిని బెదిరించడంతో పాటు బూతులు తిట్టాడు. ఎందుకు తిడుతున్నావని బైకర్లు ప్రశ్నించగా మరింత రెచ్చిపోయాడు. తనను దాటి ముందుకు వెళ్లిన ఓ బైకర్‌ను ఉద్దేశపూర్వకంగా ఢీకొట్టాడు. కారు ఢీకొట్టిన వేగానికి బైక్ పల్టీలు కొట్టింది. అదృష్టవశాత్తూ బైకర్ ప్రాణాలతో బయటపడ్డాడు.


- చిత్తశుద్ధి లేని పాలకుడు కెసిఆర్
- పాదయాత్రలో మండిపడ్డ వైఎస్ షర్మిల
- ఏడుపాయల దుర్గమ్మ సన్నిధిలో విషాదం
- నీట మునిగి ఇద్దరు మృతి
- కాంగ్రెస్, బీజేపీలు చెత్త పార్టీలు
- వారివల్లే పెట్రోలో, డీజిల్ ధరలు పెరిగాయి
- పల్లె ప్రగతిలో మంత్రి ఎర్రబెల్లి ధ్వజం
- పర్యావరణానికి చెట్లే ప్రాణం
- మొక్కలు నాటడం ఒక బాధ్యత
- బ్రహ్మకుమారీస్‌తో కలసి మొక్కలు నాటిని మంత్రి పువ్వాడ
- జిల్లాలో అంతర్జాతీయ క్రీడా సౌకర్యాలు
- మంత్రి శ్రీనివాస్ గౌడ్ వెల్లడి
- బిజెపి నేతల తప్పిదానికి దేశం ఎందుకు క్షమాపణలు చెప్పాలి
- ప్రధాని మోడీకి కెటిఆర్ ట్వీట్

3వ

# సంపాదకీయం

## వంటనూనెలపై ప్రత్యామ్నాయ ప్రణాళికలు ఏవీ?

వంటనూనెల ధరలు ఇంకా దిగిరావడం లేదు. మార్కెట్లో లీటర్ ధర 200కు తక్కువగా లేదు. పెళ్లిళ్లు, పచ్చుళ్ల సీజన్‌లో ధరల మోత సామాన్యులను సైతం కుంగదీసింది. ఉక్రెయిన్ యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియనందున దిగుమతులపై ప్రభావం తీవ్రంగా ఉంది. తాజాగా లీటర్ 202 కనీస దరగా అమ్ముతున్నారు. ప్రపంచంలో వంటనూనెలు అత్యధికంగా దిగుమతి చేసుకొనేది మన దేశమే. ఇప్పటికీ వంట నూనెల్లో విదేశీ దిగుమతులపై ప్రాథమికంగా ఆధారపడుతున్న మనం దీర్ఘకాలిక పరిష్కారం చూడాల్సిన అవసరం ఏర్పడింది. ఇతర దేశాల దిగుమతులపై ఆధారపడి, ఆ ధరల హెచ్చుతగ్గులు భరించే బదులు, వాటిని క్రమంగా తగ్గించుకుంటూ దేశీయ వంట నూనెల ఉత్పత్తిపై దృష్టి పెట్టాలి. వేరుసెనగ నూనె, ఆవనూనె, నువ్వుల నూనె లాంటి స్థానిక సాంప్రదాయిక నూనెల వినియోగాన్ని పెంచాల్సి ఉంది. మనవద్ద ఈ పంటలను విరవిగా పండించుకునే నేలలు ఉన్నాయి. అప్పుడే దేశీయంగా వంటనూనెల విషయంలో భద్రత సాధ్యం అవుతుంది. వంటనూనెలపై మన దేశ విధానాలు సైతం తాత్కాలిక ఉపశమన ధోరణిలో సాగడం మరో సమస్యగా చెప్పుకోవాలి. 1.25 లక్షల హెక్టార్లలో పామాయిల్ సాగును సబ్సిడీల తో ప్రోత్సహించి, ఉత్పత్తిని పెంచేందుకు కేంద్రం గత ఏడాదే ఓ ప్రణాళికను ప్రకటించింది. కానీ, పామాయిల్ చెట్లు పెరిగి ఉత్పత్తి సాధించి,ఫలించడానికి అయిదారేళ్ళు పడుతుంది. ఈలోగా పరిస్థితి ఏమిటన్నది చూడడం లేదు. మనవద్ద కుసుమలు, సన్‌ఫ్లవర్, నువ్వులు, వేరుశనగా ఇబ్బడిముబ్బడిగా పండుతుంది. మననేలుల వీటికి అనుకూలం. అయినా ప్రభుత్వం ఈ పంటలకు ప్రోత్సాహకాలు ఇవ్వడం లేదు. పామాయిల్ ఉత్పత్తిలో రెండో అతి పెద్ద దేశమైన మలేషియాలో కరోనాతో శ్రామికుల కొరత, ప్రపంచవ్యాప్త ఆహార ఇన్‌ఫ్లేషన్, ఉక్రెయిన్ యుద్ధంతో వంటనూనెలకు తీవ్ర సంక్షోభం ఏర్పడింది. అత్యధికంగా ఉత్పత్తి చేసి, అతి పెద్ద ఎగుమతిదారుగా నిలిచే ఆ దేశంలోనే ఆ వస్తువుకు కొరత ఏర్పడితే దాని ప్రభావం ఎలా ఉంటుందో ఇప్పుడు భారత్ అనుభవిస్తోంది. మనదేశంలో వనరులు ఉన్నా వాటిని ఉపయోగించుకోలని దౌర్భాగ్యం కారణంగా ప్రజలు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. పాలకులకు ముందు చూపు కొరవడడమే దీనికి కారణంగా చూడాలి. నూనెల ఉత్పత్తి మీద అక్కడి ప్రభుత్వం ధరల నియంత్రణలు, రవాణాపై నిరోధాలు, ఎగుమతులపై ప్రభావం చూపుతోంది. పామాయిల్‌ను అత్యధికంగా ఉత్పత్తి చేసే ఇండొనేషియాలోనూ చిత్రమైన పరిస్థితి ఏర్పడింది. నిజానికి గత ఏడాది చివరి నుంచి ప్రపంచవ్యాప్త ముడి పామాయిల్ ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి. ప్రత్యామ్నాయ నూనెల సరఫరా తగ్గడం వంటి కారణాలతో మనపైన తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇండొనేషియా పామాయిల్ ధరలపై నియంత్రణ పెట్టింది. దానివల్ల అక్రమ నిల్వలు, తిరిగి అమ్మడాలు పెరిగాయి. చివరకు ఈ ఏప్రిల్ 28 నుంచి ఎగుమతుల నిషేధం విధించింది. భారతదేశపునూనెల వినియోగంలో 40 శాతం పామాయిలే! అక్కడి సంక్షోభంతో భారత్‌లో, ప్రపంచవ్యాప్తంగా ధరలకు రెక్కలొచ్చాయి. ముడి పామాయిల్ వరకు నిషేధం లేదని ఇండొనేషియా చెప్పినా, పామాయిల్ కొరతకు ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయి. ప్రపంచంలో అధికంగా ఎగుమతి అయ్యే సన్‌ఫ్లవర్, సోయాబీన్ లాంటి ఇతర వంటనూనెల సరఫరాకు అంతరాయాలు ఏర్పడడం! సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్రపంచ వాణిజ్యంలో 80 శాతం ఉక్రెయిన్, రష్యాలవే. తీరా ఫిబ్రవరి 24న మొదలైన ఉక్రెయిన్ యుద్ధంతో నౌకా రవాణా చిక్కుల్లో పడింది. రష్యాపై ఆంక్షలతో సన్‌ఫ్లవర్ ఆయిల్ వాణిజ్యానికీ అడ్డు ఏర్పడింది. మరోపక్క దక్షిణ అమెరికాలో పొడి వాతావరణంతో సోయాబీన్ ఉత్పత్తి ఆరేళ్ళలో ఎన్నడూ లేనంతగా తగ్గిపోనుందని అంచనా. వెరసి, యుద్ధం, వర్షాభావంతో సన్‌ఫ్లవర్, సోయా బీన్ నూనెల కొరవడి, భారం పామాయిల్ మీద పడింది. బయో ఇంధనంగా పామాయిల్ వినియోగం పెరగడం. ఇండొనేషియా ప్రభుత్వం 2020 నుంచి శిలాజ ఇంధనాల దిగుమతిని తగ్గించడం కోసం డీజిల్‌లో 30 శాతం మేర పామాయిల్‌ను కలపడం తప్పనిసరి చేసింది. ఇలా బయో ఇంధనం దిశగా పామాయిల్‌ను మళ్ళించడంతో దేశీయ వంటనూనె వాడకం, ఎగుమతి విషయంలో కొరత ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో ఇండొనేషియాలో పామాయిల్ ధరలు పైపైకి ఎగబాకి, అక్కడి ప్రభుత్వం నియంత్రణలు, చివరకు ఎగుమతుల నిషేధం బాట పట్టింది. ఇండొనేషియాలోని సంక్షోభం భారత్‌లో ప్రకంపనలు సృష్టిస్తోంది. మన వార్షిక దిగుమతులైన 14-15 మిలియన్ టన్నుల వంట నూనెల్లో 8-9 మిలియన్ టన్నులతో సింహభాగం పామాయిలే. తర్వాత స్థానంలో సోయాబీన్, సన్‌ఫ్లవర్ నూనె వస్తాయి. మూడింటికీ ఇబ్బంది వచ్చిపడడంతో మన వంట నూనెల మార్కెట్ కుదుపునకు లోనైంది. ఇండొనేషియాలో ఈ జనవరి చివరలో పెట్టిన ఎగుమతి నియంత్రణల దెబ్బకే మన దేశంలో సీపీఓ మూల్యం 38 శాతం పెరిగింది. కొత్త నిషేధంతో పరిస్థితి మరింత జటిలమైంది. యుద్ధంతో ఈ మార్చిలో ప్రపంచవ్యాప్త ఆహార ధరలు 13 శాతం పెరిగాయని ఐరాస అంచనా వేసింది. కనివిని ఎరుగని రీతిలో ఇండొనేషియా సర్కార్ చేసిన నిషేధ ప్రకటనతో నూనెల ప్రపంచ ధరలు నింగి వైపు చూడసాగాయి. సోయాబీన్ నూనె ధర ఒక్క సారిగా 4.5 శాతం హెచ్చింది. ఈ ఒక్క ఏడాదే మన దేశంలో 29 శాతం పెరిగింది. ఈ క్రమంలో దేశీయంగా ఉత్పత్తులు పెంచుకోవాలి. దేశీయ అవసరాలకు తగగ్గట్లుగా పంటలను ప్రోత్సహించాలి. అప్పుడే మన అవసరాల కోసం విదేశాలపై ఆధారపడాల్సిన ఆగత్యం పోతుంది. ఈ దిశగా కేంద్రరాష్ట్రప్రభుత్వాలు ప్రణాళికలు సిద్దం చేసుకోవాలి.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

## కెసిఆర్ జాతీయ ప్రత్యామ్నాయానికి మద్దతు ఏదీ ?

### బిజెపిని వ్యతిరేకిస్తున్న వారిలో కానరాని ఐక్యత ❍ కెసిఆర్ పిలుపుపై స్పందన లేని రాజకీయ నేతలు

**హైదరాబాద్, జూన్ 6 (అక్షర వెలుగు):** సాధారణ ఎన్నికలకు దాదాపు రెండేళ్ల వ్యవధి ఉన్నది. బిజెపి పాలనా తీరును అంతా తప్పుపడుతున్న వారే. అందరూ మోడీని వ్యతిరేకిస్తున్నావారే. ఇందులో కాంగ్రెస్ మొదలు మమతా బెనర్జీ, స్టాలిన్, కెసిఆర్ సహా శివసేన కూడా ఉంది. కేజ్రీవాల్ ముందునుంచీ ఎదిరిస్తూనే ఉన్నారు. మహారాష్ట్రలో కాంగ్రెస్, ఎన్సీపి లతో కలసి అధికారంలో ఉన్న శివసేన కూడా మోడీని గట్టిగా వ్యతిరేకి స్తున్న వారే. అయితే ఈ నాయకులం తా మోడీకి వ్యతిరేకంగా కూటటి కట్టాలని, కెసిఆర్‌ను ముందుకు నడిపించిలని ఆలోచించడం లేదు. ఎవరికి వారు తామే మోడీకి ప్రత్యమ్నాయంగా చూసుకుంటున్నారు. అలాగే ఈ నాయకుల్లో ఏకాభిప్రాయం కానరావడంలేదు. జాతీయ ప్రత్యామ్నాయం పేరుతో కెసిఆర్ ఢిల్లీ, కర్నాటక రాష్ట్రాల్లో పర్యటించినా పెద్దగా స్పందన రావడం లేదు. మోడీని వద్దనుకుంటున్న వారంతా ఒక్కతాటిపైకి రాలేక పోతున్నారు. ఈ క్రమంలో తెలంగాణ సిఎం కెసిఆర్ ఎంతగా గొంతు చించుకున్నా లాభం లేకపోవచ్చు. పల్లెపట్టణ ప్రగతి మొదలు అంతకుముందు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంలోనూ టిఆర్ఎస్ మోడీకి వ్యతిరేకంగా గళం వినిపిస్తూనే ఉంది. అయినా అది గడపదాడి ఢిల్లీ వరకు వినిపించడం లేదు. ఢిల్లీలో కేజ్రీవాల్ కూడా కెసిఆర్ తో కనీసం కలసి పనిచేద్దామని ప్రకటించలేదు. కేజ్రీవాల్‌కు కూడా తెలంగాణలో వేలు పెట్టాలన్న ఉబలాటం ఉంది. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలు సమీపస్తున్న తరుణంలో ఈ పార్టీలన్నీ ఉమ్మడి కార్యాచరణ విషయంలో ఏకాభిప్రాయానికి రావడం లేదు. కెసిర్ గొంతు చించుకుంటున్నా ఎవరూ పెద్దగా పట్టించు కోవడం లేదు. దీనికితోడు రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో విపక్షాల తరఫున తాను ఉమ్మడి అభ్యర్థిగా అవతరించాలన్న కోరిక కెసిఆర్‌కు ఉందన్న సణుగుళ్లు కూడా వినవస్తున్నాయి. విపక్షాలు ఉమ్మడి అభ్యర్థిని ప్రయత్నించే క్రమంలో కెసిఆర్ పేరును తెరపైకి తెస్తారని టిఆర్ఎస్ శ్రేణులు కూడా నమ్ముతున్నాయి. ఇంట గెలిచి రచ్చ గెలవాలని అంటారు. తెలంగాణలో కేసీఆర్ తీవ్ర వ్యతిరేకతను ఎదర్కొంటున్నారు. ఓ మైనర్ బాలికపై గ్యాంగ్ రేప్ జరిగితే కనీసం కఠినంగా వ్యవహరించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. దర్యాఅప్తు విసయంలో రాజకీయ జోక్యం లేకుండా చేయడం లేదు. పబ్బుల విషయంలో కఠిన చర్యలు తీసుకోవడం లేదు. తెలంగాణ రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. పంజాబ్ రైతులకు చెక్కులు పంచడాన్ని కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పక్క రాష్ట్ర సిఎం జగన్ మాత్రం గప్‌చుప్‌గా తనపని తాను చేసుకుని పోతున్నారు. రాష్ట్రపతి ఎన్నికల్లో మద్దుతు ఇవ్వడానికి పరోక్షంగా అంగీకారం తెలిపారు. జాతీయస్థాయి నాయకుడిగా ఎదగడం కోసం కెసిఆర్ పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్ని స్తూనే ఉన్నారు. ఇటీవల తెలంగాణ ఆవిర్భావం సందర్భంగా ఫ్రంట్ పేజీలో ప్రకటనల కోసం భారీగానే ఖర్చు చేసారు. ఆత్మగౌరవం నినాదంతో తెలంగాణ ఉద్యమం మొదలైనా అదే నినాదాం ఎల్లవేళలా పనిచేయదు. అయితే బిజెపిని బూచిగా చూపి పోరాడుతున్నా పెద్దగా స్పందన కానరావడం లేదు. కేసీఆర్ కుటుంబ పాలనపై బాగా ప్రచారం సాగుతోంది. మంత్రులు, శాసనసభ్యులు, ఇతరులు కెసిఆర్ తీసుకున్న నిర్ణయాలను కాదని ఎదరించలేరు. రాచరిక వ్యవస్థను తలపిస్తున్న కేసీఆర్, మోడీది రాచరిక పాలన అంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. తెలంగాణ శాసనసభకు మరో ఏడాదిన్నరలో ఎన్నికలు జరగనున్నాయి. క్షేత్రస్థాయిలో నేతలకు వ్యతిరేకంగా ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. ఇది గుర్తించిన టీఆర్ఎస్ నాయకులు సొంతంగా సర్వేలు చేయించుకోగా ఫలితాలు ప్రతికూలంగా వస్తున్నాయి. కేసీఆర్‌కు ఎన్నికల వ్యూహకర్తగా నియమితుడైన ప్రశాంత్ కిశోర్ బృందం నిర్వహించిన సర్వేలో కూడా ప్రతికూల ఫలితాలు వచ్చాయని అంటున్నారు. దీంతో టీఆర్ఎస్ నాయకుల్లో గుబులు మొదలైంది. కేసీఆర్ ప్రభుత్వంపై ఇంత వ్యతిరేకత ఏర్పడటానికి కారణం ఏమిటనే విషయంపై టీఆర్ఎస్ ప్రముఖులు కొందరు ఆరా తీయడం మొదలెట్టారు. నిజానికి కేసీఆర్ ప్రభుత్వంలో ప్రజలకు భాగస్వామ్యం లేకుండా పోయింది. ఆయన ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండరు. ముఖ్యమంత్రిని కలుసుకొని సమస్యలు చెప్పుకొనే అవకాశం ప్రజలకు గానీ, ప్రజాప్రతినిధులకు గానీ లేదు. దీనికితోడు ఇటీవలి కాలంలోటిఆర్ఎస్ పాలనలో అవినీతి ఆరోపణలు పెరిగిపోతున్నాయి. తెలంగాణ తెచ్చుకున్నది ఒక కుటుంబం కోసమేనా అన్న బిజెపి, కాంగ్రెస్ నేతలు చేస్తున్న విమర్శలకు ప్రజలు ఆలోచిస్తున్నారు. తెలంగాణ రావడం వల్ల లాభపడింది ఆయన కుటుంబం మాత్రమేననీ ప్రజా బాహుళ్యం అభిప్రాయపడుతున్నది. ఫలితంగా వివిధ వర్గాల ప్రజలు కేసీఆర్‌పై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. రైతుబంధు వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నందున రైతాంగం మద్దతు తనకేనని నమ్ముతున్నప్పటికీ, రైతులు మాత్రం ప్రభుత్వంపై ఆగ్రహంగా ఉన్నారు. కుటుంబ పాలనను తెలంగాణ సమాజం జీర్ణించుకోలేకపోతున్నది. గత ఎన్నికల్లో తెలంగాణ సెంటిమెంట్‌ను రగిలించడం ద్వారా కేసీఆర్ లబ్ధి పొందారు. ఇప్పుడా ఛాన్స్ లేదు. కాంగ్రెస్, బీజేపీలు నిరంతరం కెసిఆర్‌ను వివిధ సమస్యలపై నిలదీస్తున్న తీరుతో ప్రజలు కూడా ఏకీభవిస్తున్నారు. కేసీఆర్ పాలనపై సోషల్ మీడియా కోడై కూస్తోంది. ఈ నేపథ్యంలో జాతీయ రాజకీయాల కోసం కేసీఆర్ చేస్తున్న ప్రయత్నాలు కూడా కలసి రావడం లేదు. దీనికితోడు బిజెపి దూకుడుగా వస్తోంది. ఇటీవల అమిత్ షా పర్యటన, డక్టర్ లక్ష్మణ్‌కు రాజ్యసభ సీటు ఇవ్వడం చూస్తుంటే తెలంగాణపై బిజెపి బాగా ఫోకస్ పెట్టిందనే చెప్పాలి. పక్క రాష్ట్రంలో అధికారంలో ఉన్న జగన్ జాతీయ రాజకీయాలపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఆయన కేవలం టిడిపి,జనసేనలను టార్గెట్ చేసుకుంటూ మూడు రాజధానుల చుట్టూ రాజకీయం నెరపుతున్నారు. ఈ క్రమంలో కెసిఆర్‌కు మద్దతు పలికే ప్రశ్నే రావడం లేదు. బిజెపితో ఉన్న అవగాహన కారణంగగా కెసిఆర్‌ను బలపరిచే ఉద్దేశ్యం జగన్‌కు ఉండకపోవచ్చు. దీంతో జాతీయ రాజకీయాల్లో ప్రత్యమ్నాయం కావాలన్న కెసిఆర్ ప్రయత్నాలు ఫలించేలా లేవు. ఎందుకంటే కెసిఆర్‌ను నమ్మి ఏ రాజకీయ పార్టీ బహిరంగంగా ప్రకటన చేయడం లేదు.

## తెలంగాణపై బిజెపి ప్రత్యేక ఫోకస్



(మొదటి పేజి తరువాయి) లేదు. ఇటీవల ప్రధాని మోడీ రెండుసార్లె హైదరాబాద్ పర్యటనకు రాగా కెసిఆర్ ముఖం చాటేశారు. గవర్నర్ తోనూ గిల్లికజ్జాలు పెట్టుకుంటున్నారు. ఈ క్రమంలో బిజెపి కూడా కెసిఆర్ పట్ల ఆగ్రహంగానే ఉంది. ఇదిలావుంటే బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి బీజేపీతోనే సాధ్యమని రాజ్యసభ సభ్యుడు, ఆ పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. సాధారణ కార్యకర్త సైతం అత్యున్నత పదవిని అందుకోవడం బీజేపీలోనే జరుగుతుందని చెప్పారు. తెలంగాణ అభివృద్ధిపై బీజేపీ ప్రత్యేక దృష్టి సారించిం దనేందుకు తన ఎన్నికే నిదర్శనమన్నారు. యూపీ అభివృద్ధిపై గతంలో మంత్రి కేటీఆర్ విమర్శలు చేశారని, తనతో పాటు వస్తే ప్రగతిని చూపిస్తానని చెప్పారు. యూపీలోని బుల్డోజర్ తరహా పాలన తెలంగాణలోనూ వస్తుందన్నారు. బీజేపీకి కులం, మత భేదాల్లేవని.. పేదరికమే ప్రాథమికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తామని వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌లో సగం జనాభా ముస్లింలేనని, అక్కడ వారికి సంక్షేమ పథకాలన్నీ అందుతున్నాయన్నారు. సీఎం కేసీఆర్‌ను గద్దె దించడమే లక్ష్యంగా ఈటల రాజేందర్, స్వామిగౌడ్, వివేక్‌వెంకటస్వామి వంటి వారు బీజేపీలో చేరారని వివరించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు సకాలంలో ఆర్థిక సహాయం చేయకుండా వందలు, వేల కోట్లు ఖర్చు చేసి జాతీయస్థాయిలో ప్రకటనలు ఇవ్వడాన్ని తెలంగాణ సమాజం ఎన్నటికీ సహించదన్నారు. కొత్త పెన్షన్లు మంజూరు కావడం లేదు. పంచాయతీలలో చేపట్టిన పనులకు డబ్బులు చెల్లించడం లేదు. దీంతో సర్పంచ్‌లు అక్కడక్కడా భిక్షాటన చేస్తున్నారు. ఇవన్నీ కనిపించడం లేదా అని లక్ష్మణ్ ప్రశ్నించారు. ప్రజాధనాన్ని తన కోసం కేసీఆర్ దుబారా చేయడాన్ని ప్రజలు సహించరని అన్నారు. జాతీయ రాజకీయాలలో త్వరలో సంచలనం చోటుచేసుకుంటుందని కేసీఆర్ ఈ మధ్య ప్రకటించారు. గతంలో అనేకమార్లు ఇలాగే ప్రకటించారు. ఆయన సంచలనం ఏమో కానీ బిజెపి తెలంగాణలో సంచలనం సృష్టిస్తుందన్నారు.

## తెలంగాణ సంస్కృతిని చాటే విధంగా బోనాలు



(మొదటి పేజి తరువాయి) శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో దేవాలయాల పరిసరాలలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. సుమారు 26 దేవాలయాలలో ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా అమ్మవారి ఊరేగింపు కోసం ప్రభుత్వం అంబారీలను ఏర్పాటు చేసి ప్రభుత్వమే పూర్తి ఖర్చులను భరిస్తుందని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం పలు ప్రాంతాల్లో ఎల్ఇడి స్క్రీన్ లు, త్రీడీ మ్యాపింగ్ లు ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. పలు ఆలయాల వద్ద ప్రత్యేకంగా స్టేజీలు ఏర్పాటు చేసి సాంస్కృతిక శాఖ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు తోపులాటకు గురికాకుండా పటిష్టమైన బారికేడ్లు ఏర్పాటు చేస్తామని అన్నారు. ప్రశాంత వాతావరణంలో బోనాల ఉత్సవాలు జరిగేలా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి అఅ కెమెరాల ద్వారా శాంతి భద్రతలను పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. భక్తుల కోసం వాటర్ ప్యాకెట్ లను అందుబాటులో ఉంచడం జరుగుతుందని చెప్పారు. అదేవిధంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలు, అంబులెన్స్‌లను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఇంకా ఏమైనా ప్రభుత్వ పరమైన ఏర్పాట్లు అవసరమైతే సంబంధిత అధికారులకు తెలియజేయాలని మంత్రి శ్రీనివాస్ యాదవ్ సూచించారు. ఈ సమీక్షలో మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, మహ్మూద్ అలీ, సిఎస్ సోమేశ్ కుమార్, డిజిపి మహేందర్ రెడ్డిలు కూడా పాల్గొన్నారు

## రాష్ట్రంలో కాంగ్రెస్, బిజెపిలకు అంత సీన్ లేదు




(మొదటి పేజి తరువాయి) వచ్చినా అరచేతిలో వైకుంఠం చూపిస్తారని పేర్కొన్నారు. నారాయణ్‌పేట జిల్లాలో పర్యటించిన మంత్రి హరీశ్‌రావు.. రూ. 56 కోట్లతో 390 పడకల ఆస్పత్రికి, రూ. 1.25 కోట్లతో టీ డయాగ్నోస్టిక్ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఇక ఎర్రగుట్ట నుంచి ఎక్లాస్ మీదుగా తెలంగాణ, కర్ణాటక సరిహద్దు వరకు రూ. 5.98 కోట్లతో 5.5 కిలోమీటర్ల మేర నిర్మించిన రోడ్డును, కొత్తగా ఏర్పాటు చేసిన డయాలసిస్ యూనిట్‌ను మంత్రి శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. నారాయణ్‌పేట జిల్లాలో 390 పడకల ఆస్పత్రి ఏర్పాటుకు శంకుస్థాపన చేసుకోవడం శుభ పరిణామం అని పేర్కొన్నారు. ఇది సీఎం కేసీఆర్ వల్లే సాధ్యమైందన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి గతంలో నాగం జనార్ధన్ రెడ్డి, డీకే అరుణ మంత్రులుగా పని చేశారు. కానీ ఒక్క మెడికల్ కాలేజీ కూడా సాధించలేకపోయారు. టీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం మొత్తం 4 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసిందన్నారు. ఒక్క పైసా ఖర్చు లేకుండా పేదలకు డయాలసిస్ సేవలు అందేలా డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. స్థానికుల కోరిక మేరకు నారాయణ్‌పేటలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి నర్సింగ్ కాలేజీని అందుబాటులోకి తీసుకొస్తామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కర్ణాటకలో రైతులకు కనీసం 6 గంటల పాటైనా కరెంట్ ఇస్తున్నారా? అని మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. మీరు సరిహద్దు ప్రాంతంలో ఉన్నారు కాబట్టి.. మీకే బాగా తెలియాలని స్థానికులను ఉద్దేశించి ఆయన అన్నారు. తెలంగాణలో మాత్రం 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామని తెలిపారు. బీజేపీ పాలిత రాష్టాల్లో రైతులకు సరిపడా విద్యుత్ ఎందుకు ఇవ్వడం లేదన్నారు. బండి సంజయ్ పాదయాత్ర చేస్తాను అంటే ప్రజలు ఎక్కడికక్కడ నిలదీయాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. మీ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మీరు ఇచ్చిన హామీలు అమలు చేసి మాట్లాడాలని, అలా సంజయ్‌ను నిలదీయాలని సూచించారు. బండి ఏ ముఖం పెట్టుకొని పాదయాత్ర చేస్తున్నారు.. వడ్ల కుప్పల వద్దకు ఎందుకు వెళ్తున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## సుప్రీం తీర్పుకు విరుద్ధంగా ప్రవర్తన

### నలుగురు పోలీస్ అధికారులకు జైలు

### హైకోర్టు సంచలన తీర్పు



**హైదరాబాద్, జూన్ 6 (అక్షర వెలుగు):** తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. నలుగురు పోలీస్ అధికారులకు 4 వారాల జైలు శిక్ష విధించింది. జాయింట్ సీపీ శ్రీనివాస్, బంజారాహిల్స్ ఏసీపీ సుదర్శన్, జూబ్లీహిల్స్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ నరేష్‌కు హైకోర్టు జైలు శిక్ష విధించింది. భార్యాభర్తల వివాదం కేసులో సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా వ్యవహరించారని పోలీస్ అధికారులపై ఆరోపణలు వచ్చాయి. సుప్రీంకోర్టు నిబంధనల మేరకు సీఆర్‌పీసీ 41ఏ నోటీసు ఇవ్వలేదని అభియోగాలు దాఖలయ్యాయి. ఈ అభియోగంపై విచారణ జరిపిన న్యాయస్థానం పోలీస్ అధికారులకు నాలుగు వారాల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చింది. అంతేకాదు నలుగురికిపై శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సీపీ సీవీ ఆనంద్‌ను న్యాయస్థానం ఆదేశించింది. అప్పీలుకు వెళ్లేందుకు శిక్ష అమలును హైకోర్టు 6 వారాలు నిలిపివేసింది.

### బండి సంజయ్ వ్యాఖ్యలు దారుణం

(మొదటి పేజి తరువాయి) బీజేపీ పాలనలో భారత్ సోమాలియాగా మారినా ఆశ్చర్యం లేదన్నారు. తెలంగాణా పథకాలను మొన్నటి వరకు మెచ్చుకుని ఇప్పుడు ఓట్ల రాజకీయం కోసం తెలంగాణాపై కుట్రలు చేస్తున్నారని అన్నారు. తెలంగాణా పథకాలు బీజేపీ పాలిత రాష్టాల్లో కావాలని అక్కడి ప్రజలు అడుగుతుండటంతోనే తెలంగాణాను చీకట్లో నెట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఢిల్లీ నుండి బీజేపీని గద్దె దింపుతేనే దేశ ప్రజల ఆకలి తీరుతుందని మంత్రి జగదీష్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు.

## నగరంలో పలుబంకుల్లో నో స్టాక్ బోర్డులు



**హైదరాబాద్, జూన్ 6 (అక్షర వెలుగు):** గ్రేటర్ హైదరాబాద్‌లో తీవ్రంగా ఇంధన కొరత ఏర్పడింది. సిటీలోని పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు వెలిశాయి. సిటీలో 40శాతం పెట్రోల్ బంకులు బంద్ అయ్యాయి. దీంతో పెట్రోల్, డీజిల్ కోసం వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డీలర్లకు క్రెడిట్ విధానాన్ని ఆయిల్ కంపెనీలు నిలిపివేశాయి. దీంతో డీలర్లు డబ్బులు లేక పెట్రోల్, డీజిల్ కొనలేదు. 100 శాతం పేమెంట్ కట్టినా 75 శాతం ఇంధనం మాత్రమే సప్లై చేస్తున్నారు. గ్రేటర్ హైద్రాబాద్‌లో మొత్తం 800 పెట్రోల్ బంకుల్లో 300 బంకులను బంద్ చేశారు.

## గూగుల్‌కు

### ఆస్ట్రేలియా కోర్టు షాక్

(మొదటి పేజి తరువాయి) ఈ క్రమంలోనే 2021 అక్టోబరులో జాన్ రాజకీయాలను వీడారు. ఈ వ్యవహారం కాస్తా ఫెడరల్ కోర్టుకు చేరగా.. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం సోమవారం తీర్పు వెలువరించింది. జాన్‌కు వ్యతిరేకంగా అప్‌లోడ్ చేసిన యూట్యూబ్ వీడియోల ద్వారా గూగుల్ వేలాది డాలర్లు ఆర్జించింది. ఎలాంటి ఆధారాలు లేకపోయినా పదేపదే జాన్‌ను అవినీతిపరుడంటూ ఆరోపణలు చేయడం.. విద్వేష ప్రసంగం కంటే తక్కువేమీ కాదు. గూగుల్, శాంక్స్ ప్రచార వీడియోల కారణంగానే జాన్ 2021 అక్టోబరులో శాశ్వతంగా రాజకీయాలను వీడాల్సి వచ్చింది. ఈ వ్యవహారంలో గూగుల్ తీరు సమర్థనీయం కాదు. జాన్ పరువుకు భంగం కలిగించినందుకు గానూ గూగుల్ ఆయనకు 7,15,000 ఆస్ట్రేలియన్ డాలర్లు(5,15,00 అమెరికన్ డాలర్లు) చెల్లించాలని ఫెడరల్ కోర్టు తీర్పునిచ్చింది. ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పుపై గూగుల్ నుంచి ఎలాంటి స్పందన రాలేదు. 2020లో శాంక్స్ ఈ వీడియోలు పోస్ట్ చేయగా.. దాదాపు 8లక్షల వ్యూస్ వచ్చాయి.

## రాష్ట్రాలు బలపడితేనే దేశాభివృద్ధి




(మొదటి పేజి తరువాయి) అతీతంగా అన్ని రాష్ట్రాలను ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రం బలంగా ఉంటేనే దేశం బలంగా ఉంటుంది. ఉత్పత్తి రంగం బలోపేతానికి కేంద్రం చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రం మంచి పని చేస్తే మెచ్చుకుంటాం.. చెడ్డ పని చేస్తే విమర్శిస్తాం అని చెప్పారు. ఎన్నికల సమయంలోనే రాజకీయ వ్యూహాలు చేయాలని కేటీఆర్ సూచించారు. తెలంగాణ పరిశ్రమల శాఖ వార్షిక నివేదికను మంత్రి కేటీఆర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రాన్నిపెట్టుబడుల కేంద్రంగా మార్చేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఎక్కడికి వెళ్లినా టీఎస్ ఐపాస్ గురించి మాట్లాడుతున్నారు. పరిశ్రమలకు అనుమతి ఇవ్వడంలో జాప్యం చేస్తే జరిమానా వేసే రాష్ట్రం మనది ఒక్కటే అని మంత్రి కేటీఆర్ తెలిపారు.టీఎస్ ఐపాస్ ద్వారా రూ. 2.32 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. ఇప్పటి వరకు 16.48 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. వీధి వ్యాపారులకు సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. కొత్త పథకాలు తేవడం కాదు.. వాటిని కచ్చితంగా అమలు చేసేందుకు కృషి చేయాలి. సీఎం కేసీఆర్ ఆలోచనలకు తగినట్లుగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. మౌలిక వసతుల కల్పనకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని కేటీఆర్ పేర్కొన్నారు. పారిశ్రామిక కారిడార్‌లకు ప్రతిపాదనలు పంపినా కేంద్రం నుంచి స్పందన లేదని కేటీఆర్ ధ్వజమెత్తారు. విభజన చట్టంలోని పారిశ్రామిక ప్రోత్సాహకాలను ఇంకా ఇవ్వలేదని మండిపడ్డారు. గుజరాత్‌లో గిఫ్ట్ సిటీ పెట్టండి.. ఇతర రాష్ట్రాలకూ గిఫ్ట్ ఇవ్వండి. సబ్ కా సాత్, సబ్ కా వికాస్‌ను కేంద్రం చేతల్లో చూపాలన్నారు. ఎన్నికలు లేనప్పుడు దేశాభివృద్ధే ప్రధాన అజెండా కావాలని చెప్పారు. నిత్యం రాజకీయాలు చేస్తే ఎప్పటికీ మూడో ప్రపంచ దేశంగా ఉంటామని స్పష్టం చేశారు. తెలంగాణలో హరిత, శ్వేత, నీలి, పింక్‌తో పాటు పసుపు విప్లవం మొదలైందని కేటీఆర్ స్పష్టం చేశారు.రాష్ట్రానికి అనేక పరిశ్రమలు వస్తున్నాయి.. అనేక పారిశ్రామికవేత్తలతో నిత్యం మాట్లాడుతున్నామని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రాభివృద్ధిలో చిన్న, మధ్యతరహా పారిశ్రామికవేత్తల పాత్ర కూడా కీలకమని స్పష్టం చేశారు. రాష్ట్రం ఏర్పడిన కొత్తలో అనేక ఇబ్బందులు పడ్డామని గుర్తు చేశారు. కానీ పొరుగు రాష్ట్రాలతో పోటీ పడి అనేక పరిశ్రమలు తెచ్చుకున్నామని పేర్కొన్నారు. పారిశ్రామిక అభివృద్ధికి మూడు ఐలు కీలకంగా గుర్తించామని తెలిపారు. ఇన్నోవేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇన్‌క్లూజివ్ గ్రోత్ మా నినాదం అని కేటీఆర్ స్పష్టం చేశారు.

# చిత్తశుద్ధి లేని పాలకుడు కెసిఆర్

## పాదయాత్రలో మండిపడ్డ వైఎస్ షర్మిల



(మొదటి పేజి తరువాయి) **ఖమ్మం, జూన్ 6(అక్షర వెలుగు):** సీఎం కేసీఆర్‌కు రాష్ట్ర ప్రజలపై చిత్తశుద్ధిలేదని వైఎస్ షర్మిల ఆరోపించారు. ఆయన బాధ్యత లేకుండా పాలిస్తున్నాడని మండిపడ్డారు. వైఎస్ షర్మిల చేపట్టిన ప్రజా ప్రస్థానం పాదయాత్ర 86వ రోజు వైరా నియోజకవర్గంలో కొనసాగుతోంది. పాదయాత్ర 1100 కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా లక్ష్మీపురంలో ఆమె మాట్లాడారు. 13 ఏళ్ల తర్వాత కూడా వైఎస్ రాజశేఖర్ రెడ్డిని గుర్తు పెట్టుకున్నారనడానికే అక్కడ పెద్ద ఎత్తున ప్రజలు గుమికూడిన జనసందోహం నిదర్శమన్నారు. మహానేతలకు మరణం లేదన్నారు. ప్రజలకిచ్చిన ఏ ఒక్క హామీని కూడా కేసీఆర్ నెరవేర్చలేదని ఆరోపించారు. అందుకే తాను వైఎస్ఆర్టీ పార్టీని స్థాపించానని చెప్పుకొచ్చారు. పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు, పోడు భూములకు పట్టాలు ఇవ్వడంలో కేసీఆర్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. హామీలు ఇచ్చి మభ్య పెట్టడం కెసిఆర్ అలవాటు చేసుకున్నారని అన్నారు.

# పర్యావరణానికి చెట్లే ప్రాణం

## మొక్కలు నాటడం ఒక బాధ్యత ● బ్రహ్మకుమారీతో కలసి మొక్కలు నాటిన మంత్రి పువ్వాడ



**హైదరాబాద్, జూన్ 6(అక్షర వెలుగు):** ఈ విశ్వం మీద నివసిస్తున్న సకల జీవరాశులకు చెట్లే ప్రణవాయువు అని, మొక్కల ప్రాముఖ్యతను తెలుసుకుని ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటాలని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ఆధ్యాత్మికత, యోగా రంగాల్లో ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందిన బ్రహ్మ కుమారీస్ సమాజం అధ్వర్యంలో చేపట్టిన 40 లక్షల మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా సోమవారం మంత్రి పువ్వాడ నివాసంలో బ్రహ్మకమారిలతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ..యోగా, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలను బోధించే బ్రహ్మ కుమారీలు 50వ 'ప్రపంచ పర్యావరణ దినోత్సవం' సందర్భంగా మొక్కలు నాటాలనే బృహత్తర సంకల్పంతో 'కల్పతరు' పేరున ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. పీల్చే గాలి, తాగే నీరు, తినే ఆహారం కులషితమై మనిషి మనుగడ ప్రశ్నార్ధకంగా మారిందనే ఆవేదనతో ముఖ్యమంత్రి కేసీఅర్ హరితహరం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. మొక్కలు నాటడంతో మాత్రమే ఈ సృష్టిని కాపాడగలమనే ఒకే ఒక్క నమ్మకంతో కేసీఅ కొనసాగిస్తున్న హరితహారం అడుగుజాడల్లో బ్రహ్మకుమారీ సమాజం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టడం మంచి నిర్ణయమన్నారు. జూన్ 5వ తేదీ నుంచి ఆగస్టు 25 వరకు జరగనున్న'కల్పతురు క్యాంపెయిన్' లో భాగంగా క్యాంపెన్ ద్వారా దేశ వ్యాప్తంగా బ్రహ్మకుమారీస్ సెంటర్ల తరఫున 40లక్షల మందితో కనీసం 40 లక్షల మొక్కలు నాటేందుకు కృషి చేస్తున్నట్లు బ్రహ్మకుమారీ అరుణ తెలిపారు. కార్యక్రమంలో బ్రహ్మ కుమారీలు బీకే గీత, బీకే రమాదేవి, బీకే ప్రసాద్, బీకే అన్నపూర్ణ తదితరులు ఉన్నారు.

# బిజెపి నేతల తప్పిదానికి దేశం ఎందుకు క్షమాపణలు చెప్పాలి

## ప్రధాని మోడీకి కెటిఆర్ ట్వీట్



**హైదరాబాద్, జూన్ 6(అక్షర వెలుగు):** ప్రధాని మోదీని ఉద్దేశిస్తూ రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. బీజేపీ నేతల వ్యాఖ్యలకు దేశం ఎందుకు క్షమాపణ చెప్పాలన్నారు. క్షమాపణ చెప్పాల్సింది బీజేపీ తప్ప దేశం కాదని కేటీఆర్ పేర్కొన్నారు. విద్వేషం వెదజల్లుతున్నందుకు తొలుత ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తాజాగా మహమ్మద్ ప్రవక్తపై బీజేపీ నేతలు నుపూర్ శర్మ, నవీన్‌కుమార్ జిందాల్ తీవ్ర అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఇరాన్, ఖతార్, కువైట్ దేశాలు ఏకంగా భారత రాయబార్లకు సమన్లు పంపి తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. భారత్ క్షమాపణలు చెప్పాలని గల్ఫ్ దేశాలు డిమాండ్ చేసిన విషయం విదితమే.

# ఏడుపాయల దుర్గమ్మ సన్నిధిలో విషాదం



నీట మునిగి ఇద్దరు మృతి

(మొదటి పేజి తరువాయి) **మెదక్, జూన్ 6 (అక్షర వెలుగు):** మెదక్ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. పాపన్నపేట మండల పరిధి ఏడుపాయల దుర్గమ్మ సన్నిధిలో నీట మునిగి ఇద్దరు మృతి చెందారు. పాపన్నపేట ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా దుర్కి గ్రామానికి చెందిన బాకా సాయిలు (42) దుర్గామాత దర్శనానికి ఆదివారం సాయంత్రం ఏడుపాయలకు చేరుకున్నాడు. ముఖం కడుక్కోవడానికి ఏడుపాయలలోని చెక్ డ్యామ్‌లోకి దిగుతుండగా కాలుజారి నీటిలో పడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య అనిత ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా, మరో ప్రమాదంలో వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలం చక్రం పల్లి గ్రామానికి చెందిన ఎండీ హకీం( 32) ఘనపూర్ ఆనకట్ట సమీపాన ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. ఇతడికి భార్య షబానా కూతురు నిహన్ ఉన్నారు. వీరు ఇరువురు ఆదివారం అమ్మవారి దర్శనానికి వచ్చి మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# జిల్లాలో అంతర్జాతీయ క్రీడా సౌకర్యాలు

## మంత్రి శ్రీనివాస్ గౌడ్ వెల్లడి



(మొదటి పేజి తరువాయి) **మహబూబ్‌నగర్, జూన్ 6(అక్షర వెలుగు):** సీఎం కేసీఆర్ క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసి క్రీడలను ప్రోత్సహిస్తున్నారని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని స్టేడియంలో రూ.30 లక్షలతో నిర్మించిన స్విమ్మింగ్ పూల్, బాస్కెట్‌బాల్, ఆర్చరీ కోర్టులను మంత్రి ప్రారంభించారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో క్రీడా మైదానాల నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. అంతర్జాతీయ స్థాయి క్రీడా సౌకర్యాలను అందుబాటులోకి తెస్తున్నామని చెప్పారు. మహబూబ్ నగర్ పట్టణ సమగ్ర అభివృద్ధియే కాకుండా క్రీడా అభివృద్ధికి అన్ని విధాల చర్యలు తీసుకుంటామని మంత్రి వెల్లడించారు. రూ. 4 కోట్లతో ఇండోర్ స్టేడియం అభివృద్ధి చేస్తున్నామని, త్వరలోనే క్రీడాకారులకు అందుబాటులోకి తెస్తామన్నారు. స్టేడియంలో సకల వసతులు కల్పిస్తున్నామని వెల్లడించారు.

# బోనాలపై మంత్రి సమీక్ష



**హైదరాబాద్, జూన్ 6(అక్షర వెలుగు):** ఈ నెల 30న గోల్కొండ బోనాలతో ఆషాడ బోనాల ప్రారంభం కానుంది. జులై 17న ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాలు ప్రారంభం కానున్నాయి. జులై 18న రంగం, భవిష్యవాణి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జులై 24న భాగ్యనగర బోనాలు, జులై 25న ఉమ్మడి దేవాలయాల ఘట్టాల ఊరేగింపు, జులై 28న గోల్కొండ బోనాలతో కార్యక్రమం ముగియనుంది. ఈ మేరకు మంత్రి తలసాని అధికారులతో సమీక్షించారు.

# కాంట్రాక్టుల కోసం అప్పులు

## తీర్చలేక టిఆర్ఎస్ నేత ఆత్మహత్య

**వరంగల్, జూన్ 6(అక్షర వెలుగు):** కాంట్రాక్ట్ చేసిన బిల్లులు రాలేదని అప్పుల బాధతో టీఆర్ఎస్ లీడర్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన వరంగల్ జిల్లాలో చోటు చేసుకుంది. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం అమృతండా గ్రామ సర్పంచ్ శాంత చిన్నమ్మ కుమారుడు బోడ వెంకన్న గ్రామంలో పలు అభివృద్ధి పనులకు కాంట్రాక్టర్ చేశాడు. కాంట్రాక్ట్ పనులకు గాను రూ. 15 లక్షలకు పైగా అప్పులు చేసి ప్రభుత్వం అందించిన పనులను కంప్లీట్ చేశాడు. అయితే ప్రభుత్వం నుండి ఎంతకీ బిల్లు రాకపోవడం, తెచ్చిన అప్పులకి వడ్డీలు పెరగడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామంలో అందరితో కలుపుగోలుగా ఉండే వ్యక్తి ఇలా ఆత్మహత్య చేసుకోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# కాంగ్రెస్, బీజేపీలు చెత్త పార్టీలు



## వారివల్లే పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి ● పల్లె ప్రగతిలో మంత్రి ఎర్రబెల్లి ధ్వజం

(మొదటి పేజి తరువాయి) **మేడ్చల్ మల్కాజిగిరి, జూన్ 6(అక్షర వెలుగు):** కాంగ్రెస్ పార్టీ నేతలు దోపిడీ దొంగల్లా మాట్లాడుతున్నారని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఫైర్ అయ్యారు. కాంగ్రెస్, బీజేపీలు చెత్త పార్టీలు. వాళ్ల వల్లే పెట్రోలో, డీజిల్, నిత్యావసర ధరలు పెరిగాయని మంత్రి ఎర్రబెల్లి మండిపడ్డారు. 5వ విడత పల్లె ప్రగతి కార్యక్రమాల్లో భాగంగా సోమవారం జిల్లాలోని మూడు చింతలపల్లిలో పర్యటించారు. మంత్రి మాల్లారెడ్డితో కలిసి మూడు చింతలపల్లిలో రూ.15 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి, 15 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణం, 13.5 లక్షలతో మండల ప్రజా పరిషత్ కార్యాలయం ప్రహరీ నిర్మాణానికి శకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ..కాంగ్రెస్, బీజేపీ పార్టీలతో ప్రజలకు ఏనాడూ మేలు జరగలేదన్నారు. వాళ్లే లాభ పడ్డారు. చేతగాని దద్దమ్మలు అని ఘాటుగా విమర్శించారు. తుపాకీ వెంకట్రాముడు లాగా మాట్లాడుతారు. వీళ్ల పాలనలో రాష్ట్రం, దేశం సర్వనాశనం అయిందన్నారు. గ్రామాల్లో కనీస వసతులు లేని పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ వచ్చాక గ్రామాలకు మంచి రోజులు వచ్చాయన్నారు. ప్రతి గ్రామానికి నిధులు అందే విధంగా రాష్ట్రంలో గ్రామ పంచాయతీలకు 230 కోట్లు ఇస్తున్నది సీఎం కేసీఆర్ మాత్రమే అన్నారు. ప్రతి గ్రామంలో ఇంటింటికీ నీళ్లు, ప్రతి గ్రామానికి ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్, నర్సరీ, డంపింగ్ యార్డు, వైకుంఠ ధామాలు వచ్చాయన్నారు. గతంలో మనం ఎప్పుడైనా చూశామా? అని ప్రశ్నించారు. పల్లెలు పరిశుభ్రంగా మారి అభివృద్ధిని సాధించాయన్నారు. పలలె ప్రగతిని కొనసాగించి మన పల్లెలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శరత్ చంద్రా రెడ్డి, పంచాయితీ రాజ్ కమిషనర్ శరత్, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అయితే ముడు చింతలపల్లి మండల కేంద్రంలో జరిగిన పల్లె ప్రగతి కార్యక్రమం రసాభాసగా మారింది.ఈ కార్యక్రమంలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, మల్లారెడ్డి పాల్గొన్నారు. అక్కడ జరుగుతున్న సభలో మంత్రులు మాట్లాడుతుండగా.. కాంగ్రెస్ నేత సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిచారు. దీంతో సభలో గొడవ జరిగింది. సభలో టీఆర్ఎస్,కాంగ్రెస్ నేతల మధ్య తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. సభలో కాంగ్రెస్ నేతలు ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు జిల్లా పరిషత్ ఎలోర్ లీడర్ హరి వర్ధన్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుండి ఆయనను పోలీసు వాహనంలో స్టేషన్ కు తరలించారు.

# బిజెపి తీరుతో గల్ఫ్‌లో అవమానాలు



## బిజెపినేతలపై చర్యలుతీసుకోవాలన్న ఓవైసీ

**హైదరాబాద్, జూన్ 6(అక్షర వెలుగు):** మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ మాజీ అధికార ప్రతినిధి నుపుర్ శర్మను అరెస్ట్ చేయాల్సిందేనని ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ డిమాండ్ చేశారు. ఆమె చేసిన వ్యాఖ్యల వల్ల గల్ఫ్ దేశాల్లో భారత్‌పై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయని, అరబ్ దేశాల్లో భారత్ ముఖం చెల్లకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. భారత విదేశాంగ విధానం నాశనమై పోయిందన్నారు. నుపుర్ శర్మను సస్పెండ్ చేస్తే సరిపోదని, ఆమెను అరెస్ట్ చేయాలని అన్నారు. భారత విదేశాంగ శాఖ బీజేపీలో భాగమా అని ప్రశ్నించిన ఒవైసీ.. గల్ఫ్ దేశాల్లోని భారతీయులపై హింస, జాత్యహంకార దాడులు జరిగితే విదేశాంగ శాఖ అప్పుడేం చేస్తుందని ప్రశ్నించారు. ఇలాంటి అవమాన కరమైన వ్యాఖ్యలు చేసేందుకు బీజేపీ తన అధికార ప్రతినిధులను ఉద్దేశపూర్వకంగానే చర్చలకు పంపుతుందని ఒవైసీ ఆరోపించారు. అంతర్జాతీయ వేదికపై నుంచి విమర్శలు రావడంతోనే నుపుర్ శర్మపై బీజేపీ చర్యలు తీసుకుందని అన్నారు. మహ్మద్ ప్రవక్తపై వ్యాఖ్యల ఫలితంగా ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడి గౌరవార్థం ఖతర్‌లో ఇవ్వాల్సిన విందు రద్దు అయిందని, రెండు గల్ఫ్ దేశాలు భారత రాయబారులకు సమన్లు ఇచ్చాయని గుర్తు చేశారు. నుపుర్ శర్మపై చర్యలు తీసుకోవాలని ప్రధానిని తానెప్పుడో కోరానని, కానీ ఆయన పెడచెవిన పెట్టారని విమర్శించారు. గల్ఫ్ దేశాల నుంచి వ్యతిరేకత వ్యక్తమైన తర్వాత మాత్రమే చర్యలు తీసుకున్నారని, కానీ అదెప్పుడో చేసి ఉండాల్సిందని అన్నారు. తమ అధికార ప్రతినిధి ముస్లింల మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు చేసిన విషయాన్ని తెలుసుకునేందుకు బీజేపీకి పది రోజులు పట్టిందని ఒవైసీ తూర్పారబట్టారు.

# మినీ ట్యాంక్‌బండ్ పనులు త్వరగా పూర్తి చేయాలి మంత్రి



**మహబూబ్‌నగర్, జూన్ 6(అక్షర వెలుగు):** మినీ ట్యాంక్ బండ్‌లో చేపట్టిన ఐలాండ్, సస్పెన్షన్ బ్రిడ్జి పనులను త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అధికారులను ఆదేశించారు. సోమవారం మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనులను మంత్రి తనిఖీ చేశారు. వర్షాకాలం సమీపిస్తున్నందున పెద్ద చెరువులో పూడిక తీసే పనులను వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా సస్పెన్షన్ బ్రిడ్జి పనులు, ఐలాండ్ పనులు కూడా త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఒకేసారి ఐలాండ్ , తీగల వంతెన, నెలకెస్ రోడ్డు నిర్మాణం పనులన్ని జరిగేలా చూడాలన్నారు. అవసరమైతే మరింత మంది లేబర్, యంత్రాలను ఉపయోగించి పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా వర్షపు నీరు చెరువులో చేరకుండా అదేవిధంగా మురికి నీరు చెరువు లోకి రాకుండా బయటికి పంపేలా తీసుకోనే చర్యల పై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు పలు సూచనలు చేశారు. మంత్రి వెంట మున్సిపల్ చైర్మన్ కె నరసింహులు, ముడా చైర్మన్ వెంకన్న, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్, ఇరిగేషన్ ఇంజినీర్లు, తదితరులు ఉన్నారు.

# పిడుగుపాటుకు గీతకార్మికుడి మృతి

**నల్లగొండ, జూన్ 6(అక్షర వెలుగు):** జిల్లాలోని చిట్యాల మండలంలో విషాదం చోటుసుకుంది. మండలంలోని వెలిమినేడులో పిడుగుపాటుకు గీతకార్మికుడు మృతిచెందాడు. గ్రామానికి చెందిన అంతటి శివకుమార్ (29) ఆదివారం సాయంత్రం కల్లు గీయడానికి వెళ్లాడు. అయితే ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో ఓ చెట్టు కింద నిలబడ్డాడు. కాగా, అదే చెట్టుపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అయితే రాత్రి పొద్దుపోయినప్పటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతని కోసం వెతికారు. ఈక్రమంలో సోమవారం ఉదయం శివకుమార్ మృతదేహాన్ని గుర్తించారు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించారు.

# పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష

**హైదరాబాద్, జూన్ 6(అక్షర వెలుగు):** రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో పోస్టు గ్రాడ్యుయేషన్, ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష(సీపీగెట్) నోటిఫికేషన్‌ను ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్ లింబాద్రి విడుదల చేశారు. ఉస్మానియా, కాకతీయ, పాలమూరు, మహాత్మాగాంధీ, శాతవాహన, తెలంగాణ, జేఎన్టీయూ హెచ్, మహిళా వర్సిటీల్లో సీపీగెట్ ద్వారా ప్రవేశాలు కల్పించనున్నారు. నేటి నుంచి జులై 4వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఆలస్య రుసుంతో జులై 15 వరకు దరఖాస్తులను సమర్పించొచ్చు. జులై 20 నుంచి సీపీగెట్ ఆన్‌లైన్‌లో ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నారు.

# పల్లె ప్రగతితో గ్రామాల్లో అభివృద్ధి

## పరిశుభ్రంగా కనిపిస్తున్న పల్లెలు ❑ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి



**రంగారెడ్డి, జూన్ 6(అక్షర వెలుగు):** పల్లె ప్రగతి కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలిచిందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమం పుణ్యమా అంటూ నేడు ప్రతి గ్రామంలో పకృతి వనం, డంపింగ్ యార్డు, కంపోస్టు షెడ్డు, వైకుంఠ ధామం తదితర వసతులతో ప్లలెల సమస్యలు తీరినట్లు మంత్రి తెలిపారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం ప్రగతి దిశగా పయనిస్తుందన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం సాయిరెడ్డిగూడ గ్రామంలో టీఐసీసీ మంజూరు చేసిన 70లక్షల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ప్లలె ప్రగతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..పల్లెలు, పట్టణాలు పరిశుభ్రతతో కళకళలాడుతున్నాయన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఒకప్పుడు చెత్త కుప్పలు, మురుగు నీటితో గ్రామాలు కంపు కొడుతే.. నేడు పచ్చని చెట్లు, పరిశుభ్రతకు అనవాళ్లుగా మారి ప్రజలకు ఆహ్లాదన్ని పంచుతున్నాయన్నారు. ప్రతి ఊరికో క్రీడా ప్రాంగణం ఏర్పాటు గొప్ప విషయమన్నారు. దీంతో గ్రామీణ క్రీడాకారులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు.అలాగే బడి బాటకు విశేష స్పందన వస్తుందని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మంద జ్యోతి, వైఎస్ ఎంపీపీ గంగుల శమంత, మార్కెట్ చైర్‌పర్సన్ సురుసాని వరలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




# చలన చిత్రం




## అమెజాన్ ప్రైమ్‌కు అంటే సుందరానికీ ఓటిటి హక్కులు


ఫలితం ఎలా ఉన్నా ప్రేక్షకులకు కొత్త కథలను చూపించాలని అనుకునే అతికొద్ది మంది నటులలో నాని ఒకడు. ఈయన నుంచి సినిమా వస్తుందంటే ప్రేక్షకులు కూడా ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తుంటారు. రొటీన్‌కు భిన్నంగా కథలను ఎంచుకుంటూ మినిమమ్ గ్యారెంటీ హీరోగా టాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. ప్రస్తుతం ఈయన హీరోగా నటించిన లేటెస్ట్ చిత్రం 'అంటే సుందరానికీ' వివేక్ ఆత్రేయా దర్శకత్వం వహించాడు. ఈ చిత్రంపై ప్రేక్షకులలో మొదటి నుంచి భారి అంచనాలున్నాయి. ఇటీవలే విడుదలైన ట్రైలర్ అంచనాలను రెట్టింపు చేశాయి. ఈ చిత్రం జూన్ 10న విడుదల కానుంది. ఈ క్రమంలో చిత్రబృందం తరచూ ఏదో ఒక అప్‌డేట్‌తో ప్రేక్షకులను పలకరిస్తుంది. తాజాగా మేకర్స్ మరో అప్‌డేట్‌ను ప్రకటించారు. 'అంటే సుందరానికి' నాన్ థియేట్రికల్ హక్కులను అమెజాన్ ప్రైమ్ దక్కించుకుంది. అమెజాన్ సంస్థ భారీ ధరకు మేకర్స్‌తో డీల్ కుదిరించుకుందట. సినిమా విడుదలైన నాలుగు వారాల తర్వాత డిజిటల్ స్ట్రీమింగ్ చేయాలని ఒప్పందం కదుర్చుకుందట. ఈ చిత్రంలో నానికి జోడీగా నజ్రియా హీరోయిన్‌గా నటించింది. నజ్రియా తెలుగులో నటించిన మొదటి చిత్రం ఇదే కావడం విశేషం. ఈ చిత్రంలో నాని బ్రాహ్మణుడి పాత్రలో నటించగా, నజ్రియా క్రిస్టియన్ అమ్మాయిగా నటించింది. మైత్రీ సంస్థ నిర్మించిన ఈ చిత్రానికి వివేక్ సాగర్ సంగీతం అందించాడు.




## యాక్షన్ థ్రిల్లర్‌గా స్పై

యువ హీరో నిఖిల్ వరుస సినిమాలతో జోరుమీదున్నాడు. 'అర్జున్ సురవరం' తర్వాత ఇప్పటివరకు ఈయన నుంచి మరో సినిమా రాలేదు. ఈ మూడేళ్ళ గ్యాప్‌ను పూర్తి చేసేందుకు నిఖిల్ వరుసగా సినిమాలను ఒప్పుకుంటున్నాడు. ప్రస్తుతం ఈయన చేతిలో నాలుగు సినిమాలున్నాయి. అందులో 'స్పై' ఒకటి. ప్రముఖ ఎడిటర్ గ్యారీ బీహెచ్ దర్శకుడిగా పరిచయమవుతూ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. ఇటీవలే చిత్రం నుంచి విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన వచ్చింది. ఈ క్రమంలో మేకర్స్ తాజాగా స్పై ఇంట్రో గ్లింప్స్‌ను విడుదల చేశారు. లేటెస్ట్‌గా విడుదలైన ఇంట్రో గ్లింప్స్‌లో నిఖిల్ స్టైలిష్‌గా ఉన్నాడు. చుట్టూ మంచు.. మంచుతో కప్పి ఉన్న గన్స్ బాక్స్. ఆ బాక్స్‌లో నుండి నిఖిల్ గన్ తీసుకుని మాగజీన్ లోడ్ చేసి.. బైక్ పై ఎవర్నో ఫాలో అవుతూ షూట్ చేస్తున్నట్లు గ్లింప్స్‌లో ఉంది. ఇంట్రో గ్లింప్స్‌ను చూస్తుంటే హాలీవుడ్ రేంజ్ యాక్షన్ తలపిస్తుంది. జులైన్ ఎస్ట్రాడా కెమెరా విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. శ్రీచరణ్ పాకాల బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ వేరే లెవల్లో ఉంది. పాన్ ఇండియా సినిమాగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నిఖిల్‌కు జోడీగా ఐశ్వర్యా మీనన్ హీరోయిన్‌గా నటిస్తుంది. ఈడి ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై రాజశేఖర్ రెడ్డి, చరణ్ తేజ్ ఉప్పలపాటిలు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం వచ్చే ఏడాది దసరాకు తెలుగుతో పాటు హిందీ, తమిళ్, కన్నడ, మలయాళం భాషల్లో విడుదల కానుంది.

## పెళ్లంటే భయమేస్తోందంటున్న శృతి



పెళ్లంటేనే భయమేస్తోందని నటి శృతి హాసన్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం శాంతను హజారికాతో కలిసి సహజీవనం చేస్తోంది శ్రుతి హాసన్. తాజాగా ఆమెకు ఎదురైన ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ, 'పెళ్ళంటేనే భయమేస్తోంది. నా తల్లిదండ్రుల పెళ్ళి విడాకులకు దారితీసిందని నేను ఈ మాట చెప్పడం లేదు. కానీ, నాలో పెళ్లి అంటే అదోరకమైన భయం ఏర్పడుతోంది. వివాహం అంటే ఎంతో నమ్మకం ఉన్నప్పటికీ లోలోపల భయం మాత్రం ఉంది. పైగా శాంతను నా జీవితంలోకి ప్రవేశించిన తర్వాత అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. అనేక విషయాల్లో మా ఇద్దరి ఆలోచనలు ఒకే విధంగా ఉన్నాయి' అని వివరించింది. ప్రస్తుతం శ్రుతి స్టేట్‌మెంట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దానికి రకరకాలుగా నెటిజెన్స్ స్పందిస్తున్నారు. మరి పెళ్ళి చేసుకోకుండా శ్రుతి ఎంతకాలం శాంతనుతో సహజీవనం చేస్తుందో అని చర్చించుకుంటున్నారు. లోక నాయకుడు కమల్ హాసన్ పెద్ద కుమార్తెగా సినీ ఇండస్ట్రీలో అడుగుపెట్టి, ఆ తర్వాత తన వ్యక్తిగత టాలెంట్‌తో ఉన్నతస్థాయికి చేరుకుంది అందాల శ్రుతి హాసన్. సంగీత దర్శకురాలిగా, కథానాయికగా, సింగర్‌గా.. ఇలా ఒకటేమిటి అన్నిరంగాల్లోనూ ఆమెకు మంచి ప్రవేశముంది. ఇటు ఆకర్షించే అందం, అటు ఆకట్టుకొనే అభినయం మెండుగా, నిండుగా కలిగిన నటీమణి శ్రుతి. బిఫోర్ లాస్టియర్ 'క్రాక్ గతేడాది 'వకీల్‌సాబ్' చిత్రాలతో బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకున్న శ్రుతి ఈ ఏడాది ఏకంగా మూడు పెద్ద సినిమాల్ని లైన్‌లో పెట్టుకుంది. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ సీనియర్ స్టార్ హీరో సరసన కథానాయికగా నటిస్తుండగా.. మెగాస్టార్ చిరంజీవి బాబీ కలయికలో తెరకెక్కుతోన్న 'వాల్తేరు వీరయ్య' చిత్రంలోనూ హీరోయిన్ గా నటిస్తోంది. అలాగే.. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తున్న రీ యాక్షన్ చిత్రం 'సలార్' లోనూ అమ్మడు కథానాయికగా నటిస్తోంది.



## తమన్నాతో విభేదాలా.. అలాంటిదేమీ లేదన్న దర్శకుడు

పటాస్‌తో దర్శకుడిగా కెరీర్ ఆరంభించాడు అనిల్ రావిపూడి. ఇప్పటిదాకా తీసిన ప్రతి సినిమా కూడా బాక్సాఫీస్ దగ్గర సక్సెస్ అవుతూనే వచ్చింది. అపజయం అనేదే తెలియని ఈ డైరెక్టర్ ఇటీవలే ఎఫ్ 3తో మరో సక్సెస్ అందుకున్నాడు. అయితే ఈ సినిమా చిత్రీకరణ సమయంలో అనిల్‌కు, హీరోయిన్ తమన్నాకు మధ్య గొడవలు జరిగాయంటూ ఊహాగానాలు మొదలయ్యాయి. అందుకే తమన్నా ఎఫ్ 3 ప్రమోషన్స్‌కు కూడా రాలేదని వార్తలు వెలువడ్డాయి. తాజాగా దీనిపై అనిల్ స్పందిస్తూ.. 'ఎక్కువమంది ఆర్టిస్టులతో పని చేసినప్పుడు చిన్నచిన్న సమస్యలు ఎదురవుతుంటాయి. తమన్నాది పెద్ద గొడవేం కాదు. ఒకరోజు రాత్రి షూటింగ్ ఇంకాస్త పొడిగించాల్సి వచ్చింది. దానికామె పొద్దున్నే జిమ్ చేసుకోవాలి, టైం లేదు, వెళ్లిపోవాలి అని మాట్లాడింది. అలా రెండురోజులు మా మధ్య కొంత హీట్ నడిచింది. ఆ తర్వాత మళ్లీ ఎప్పటిలాగే మాట్లాడుకున్నాం. వేరే సినిమా షూటింగ్స్‌లో ఉండటం వల్ల తను ప్రమోషన్స్‌కు రాలేకపోయింది' అని చెప్పుకొచ్చాడు. కొంత సమయం తీసుకున్నా సరే ఎఫ్ 4 చేస్తానన్నాడు అనిల్ రావిపూడి. కాగా మే 27న రిలీజైన ఎఫ్ 3 సినిమా 9 రోజుల్లోనే రూ.100 కోట్ల గ్రాస్ సాధించింది.

## పల్లవికి అండగా నిలిచిన రానా



కర్నూలులో విరాటపర్వం మూవీ ట్రైలర్ లాంఛ్ కార్యక్రమానికి ప్రేక్షకులు భారీగా తరలివచ్చారు. జోరు వాన ఆటంకం కలిగించినా ఏ మాత్రం వెనక్కితగ్గని అభిమానులు ఈవెంట్ ను సక్సెస్ చేశారు. ఈ కార్యక్రమంలో సాయి పల్లవి ప్రసంగిస్తున్న సమయంలో అభిమానులు కేరింతలు కొడుతూ ఆమెపై అభిమానం చాటుకున్నారు. ఫ్యాన్స్ గోల మంధ్య ఆమె ఏం మాట్లాడిందో కూడా అర్థం కాలేదు. సాయి పల్లవి మాట్లాడుతున్న సమయంలో ఒక్కసారిగా గాలివాన మొదలైంది. అయితే ఆమె తన స్పీచ్ కొనసాగించింది. వాన ఎక్కువ కావడంతో రానా స్వయంగా సాయి పల్లవి కోసం గొడుగు పట్టుకుని నిలబడ్డాడు. అది చూసి అభిమానుల కేరింతలు మరింత ఎక్కువయ్యాయి. ప్రస్తుత ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. రానా చేసిన పనికి నెటిజన్లు ప్రశంసలతో ముంచెత్తుతున్నారు.

## పుష్ప-2 పై అప్పుడే ఊహాగానాలు

టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుష్ప సినిమాతో బిగ్ హిట్ అందుకున్న విషయం తెలిసిందే. సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాకి సీక్వెల్ చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.జూలై నుండి ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుందని తెలుస్తోంది.ఈ సినిమాలో హీరో విలన్ కి మధ్య జరిగే పోరాటమే ప్రధానంగా హైలైట్ చేయనున్నారు.ఈ సినిమాలో బన్నీని సరికొత్త గెటప్ లో చూపించబోతున్నట సుకుమార్. అల్లు అర్జున్ ను ఇందులో నడివయసు పాత్రలో చూపించనున్నారని సమాచారం. సినిమా చివరలో ఆయన ఆ లుక్ తో కనిపిస్తాడా? లేదంటే పోలీసుల బారి నుంచి తప్పించుకోవడానికి ఆయన ఆ గెటప్ వేస్తాడా? అనేది చూడాలి. 'పుష్ప'లో రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ అందించన సంగీతం హైలెట్ గా నిలిచాయి. దాంతో ఈ సారి తన నుంచి అంతకు మించిన అవుట్ పుట్ ఇవ్వడానికి దేవిశ్రీ రెడీ అవుతున్నాడని చెబుతున్నారు. పుష్పలో సమంత ఐటమ్ సంచలనం సృష్టించింది. ఇప్పుడు పుష్ప-2లో కూడా ఉండబోతుంది. ఈ ఐటమ్ సాంగ్ కోసం బాలీవుడ్ బ్యూటీ దిశా పటానీని తీసుకోనున్నట్టు తెలుస్తోంది. మరి ఈసారి దిశా పటానీ ఏ రేంజ్ అకట్టుకుంటుందో చూడాలి. బన్నీ ఫ్యాన్స్ అంతా ఆతుతాగా ఎదురు చూస్తున్న ఈ మూవీ 2023లో రిలీజ్ కానుంది.






## సల్మాన్‌నూ వీడని సినిమా కష్టాలు

సల్మాన్ ఖాన్.. బాలీవుడ్ స్టార్ హీరోల జాబితాలో ముందు వరుసలో ఉంటాడీ భాయ్‌జాన్. ఎన్నో హిట్ సినిమాలతో ప్రేక్షకులను అలరించిన ఆయనకు ఒకానొక సమయంలో చేతిలో ఒక్క ప్రాజెక్ట్ కూడా లేకుండా పోయిందట. అబుదాబిలో జరిగిన ఐఫా వేడుకలో ఈ విషయాన్ని గుర్తు చేసుకుని కంటతడి పెట్టుకున్నాడు సల్మాన్. 1989లో మైనే ప్యార్ కియా రిలీజైంది. ఈ సినిమా తర్వాత భాగ్యశ్రీ ఇండస్ట్రీకి గుడ్‌బై చెప్పి పెళ్లి చేసుకుని సెటిలైపోదామని ఫిక్సైంది. దీంతో ఆ సినిమా క్రెడిట్ అంతా భాగ్యశ్రీ ఖాతాలో పడింది. ఈ మూవీ రిలీజయ్యాక ఆరు నెలలపాటు నాకు ఒక్క ప్రాజెక్ట్ కూడా రాలేదు. అప్పుడే రమేశ్ తౌరానీ ఒక దేవుడిలా నా జీవితంలో అడుగుపెట్టాడు. మా నాన్న రెండు వేల రూపాయలిచ్చి అతడితో సినిమా తీస్తున్నట్లు నిర్మాత జీపీ సిప్పీతో పత్రికలో ఒక ఫేక్ ప్రకటన వేయించాడు. నిజంగా సినిమా తీశామా అంటే లేదు. ఆ తర్వాత రమేశ్ ఒకసారి సిప్పీ ఆఫీస్‌కు వెళ్లి కొత్త సినిమా మ్యూజిక్ కోసం రూ.5 లక్షలిచ్చాడు. అలా నాకు పత్తర్ కె ఫూల్(1991) సినిమా ఛాన్స్ వచ్చింది. వాంటెడ్ వంటి బ్లాక్‌బస్టర్ సినిమాలిచ్చి బోనీకపూర్ కూడా నాకెంతో సాయం చేశాడు. ఇదిలా ఉంటే ఓసారి షాప్‌లో నేను కొత్త చొక్కాలవైపు అలానే చూస్తున్నాను. వాటిని కొనేందుకు నాదగ్గర పెద్దగా డబ్బుల్లేవు. అప్పుడు సునీల్ శెట్టి నన్ను చూసి నాకు షర్ట్, వాలెట్ బహుమతిగా ఇచ్చాడు' అని చెప్తూ ఎమోషనలయ్యాడు సల్మాన్.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **GPR PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
TITLE CODE.TELTEL02057, Cell:8464816456 Email: aksharavelugudaily@gmail.com, Website: www.aksharavelugu.com